# మారుతి కార్లపై బంపర్ ఆఫర్లు

## రూ.74వేల వరకు రాయితీ ఇస్తున్న సంస్థ




న్యూఢిల్లీ, జూన్ 6: కార్ల తయారీలో సంస్థ మారుతి సుజుకీ నూతన వాహన కొనుగోలు దారులకు శుభవార్తను అందించింది. ప్రస్తుత నెలలో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండే అవకాశం ఉంటుందన్న అంచనాతో సంస్థ వినూత్న ప్రణాళికను తెరపైకి తీసుకొచ్చింది. మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉన్న మాడళ్లపై ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన మాడళ్లపై రూ.74 వేల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది. దీంతో నగదు డిస్కౌంట్‌తోపాటు ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ఆఫర్స్ కూడా ఉన్నాయి. ఈ ఆఫర్ ఈ నెల చివరి వరకు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. వీటిలో బాలెనో, ఫ్రాంక్స్, గ్రాండ్ విటారా, జిమ్నీ, ఎక్స్ఎల్6, సియాజ్, ఇగ్నిస్ మాడళ్లు ఉన్నాయి.

### బాలెనో

- నగదు రాయితీ కింద రూ.40 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద రూ.2 వేలు కలుపుకొని మొత్తంగా రూ.57 వేల వరకు ప్రయోజనం లభించనున్నది. ఈ కారు ధర రూ.6.66–9.88 లక్షలు.

### ఫ్రాంక్స్

- ఈ మాడల్‌ను కొనుగోలు చేసిన వారికి నగదు రాయితీ కింద రూ.15 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.10 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద మరో రూ.2 వేలు కలుపుకొని మొత్తంగా రూ.27 వేలు ప్రయోజనం కలగనున్నది. ఈ కారు రూ.7.51–13.04 లక్షల లోపు ధరలో లభించనున్నది.

### గ్రాండ్ విటారా

- ఈ కారుపై నగదు డిస్కౌంట్ కింద రూ.20 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.50 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద మరో రూ.4 వేలు రాయితీ ఇస్తున్నది సంస్థ. రూ.18.43 లక్షల ధర కలిగిన హైబ్రిడ్ మాడల్‌కు మాత్రమే ఈ ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్‌ను అందిస్తున్నది. ప్రస్తుతం మార్కెట్లో గ్రాండ్ విటారా రూ.11 లక్షల నుంచి రూ.20.09 లక్షల లోపు ధరలో లభిస్తున్నది.

### జిమ్నీ

- ఈ మాడల్‌పై నగదు డిస్కౌంట్ కింద రూ.50 వేలు అందిస్తున్నది. కానీ, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ వంటివి ఈ మాడల్‌పై సంస్థ ఇవ్వడం లేదు. రూ.12.74 లక్షల నుంచి రూ. 14.95 లక్షల లోపు ధరలో లభిస్తున్నది.

### ఎక్స్ఎల్ 6

- ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.20 వేలు డిస్కౌంట్ కల్పిస్తున్నది సంస్థ. ఈ మాడల్ రూ.11.61 లక్షల నుంచి రూ.14.77 లక్షల లోపు ధరను నిర్ణయించింది.

### సియాజ్

- ఈ మాడల్‌పై నగదు డిస్కౌంట్ కింద రూ.20 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.25 వేలు కలుపుకొని మొత్తంగా రూ.45 వేలు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. ఈ మాడల్ ధర రూ.9.40–12.29 లక్షలు.

### ఇగ్నిస్

- నగదు రాయితీ రూపంలో రూ.40 వేల వరకు అందిస్తున్న సంస్థ.. ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద రూ.3 వేలు కలుపుకొని మొత్తంగా రూ.58 వేలు ప్రయోజనాలు కల్పిస్తున్నది. ఆటోమేటిక్ వెర్షన్‌కు మాత్రమే ఈ ఆఫర్‌లు వర్తించనున్నాయి. ఈ కారు రూ.5.84 –8.11 లక్షలలోపు లభించనున్నది.

# పసిడి పరుగు

**{రూ.680 పెరిగి రూ.73,500కి తులం ధర}**

న్యూఢిల్లీ, జూన్ 6: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహానికి డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పుంజుకున్నాయి. గురువారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.680 ఎగబాకి మళ్లీ 73 వేలు దాటి రూ.73,500కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.72,820గా ఉన్నది. వెండి ర్యాలీ కొనసాగించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.1,400 అందుకొని రూ.91,900 నుంచి రూ.93,300కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.770 అధికమై రూ.73,420కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.700 ఎగబాకి రూ.67,300కి చేరుకున్నది. కిలో వెండి రూ.1,800 ఎగబాకి రూ.98 వేలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లకు చేరుకోగా, వెండి 30.30 డాలర్లుగా నమోదైంది.





## ఈసారీ వడ్డీరేట్లు యథాతథం?

ముంబై, జూన్ 6: ఈసారీ కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. బుధవారం మొదలైన మూడు రోజుల ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష.. శుక్రవారం ముగుస్తున్నది. దీంతో ఉదయం రెపో, రివర్స్ రెపో వడ్డీ రేట్లపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఓ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఫలితంగా రెపో రేటు 6.5 శాతం వద్దే ఉంటున్నది. దీంతో రుణాలపై వడ్డీరేట్లు తగ్గడం లేదు. ఈఎంఐల భారం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిల్లోనే ఉన్నందున ఈసారి కూడా వడ్డీరేట్లు తగ్గకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వడ్డీరేట్లు తగ్గించిన ఈసీబీ

న్యూఢిల్లీ, జూన్ 6: యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించింది. దీంతో బెంచ్‌మార్క్ రేటు 4 శాతం నుంచి 3.75 శాతానికి దిగొచ్చింది.

# రోజూ 3 కోట్లకు టోకరా

## ట్రేడింగ్ పేరుతో హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్ల మోసాలు

### అత్యాశకు పోయి బాధితులు లబోదిబో

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): వాట్సాప్, టెలిగ్రామ్‌లను అడ్డాగా చేసుకొని ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రోజూ సరాసరిన హైదరాబాద్‌లో రూ.3 కోట్ల దాకా కొల్లగొడుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని సైబర్ క్రైమ్ ఠాణాలకు వస్తున్న ఫిర్యాదుల్లో గతకొంత కాలంగా ఈ కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. ట్రేడింగ్‌లో లాభాలొస్తాయని, ఆ కిటుకులు మేం నేర్పుతామంటూ సోషల్ మీడియాలో కొందరు ఊదరగొడుతున్నారు. వాట్సాప్ సందేశాలతో అమాయకులను బుట్టలో వేసుకుంటున్నారు.

**ఇదీ సంగతి..**

ఈ ట్రేడింగ్ మోసాలలో ముందుగా వాట్సాప్ టెక్స్ట్ మెసేజ్‌లు వస్తున్నాయి. ఆ తరువాత టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం ఇస్తున్నారు. అయితే ఈ గ్రూప్‌లో ఉండేవారిలో 90 శాతం మోసగాళ్లకు సంబంధించినవారే. తాము ట్రేడింగ్ చేస్తే ఇంత లాభం.. అంత లాభం వచ్చిందంటూ గ్రూప్‌లో ఉన్నవారిని ఉత్సాహపరుస్తూ మరింత ఆశ పెంచేలా పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే ముందుగా తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టించి లాభాలు చూపిస్తున్నారు. దీంతో నమ్మకం కుదిరి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి ఇన్వెస్టర్లు నిండా మునుగుతున్నారు. కాగా, తమ యాప్‌లు, వెబ్‌సైట్‌ల లింక్‌ల ద్వారానే ట్రేడింగ్ చేయాలని మోసగాళ్లు సూచిస్తున్నట్టు బాధితులు చెప్తున్నారు. తక్కువ పెట్టుబడులకు నగదు విత్‌డ్రా ఆప్షన్ ఇస్తున్న నేరగాళ్లు.. ఎక్కువ పెట్టుబడులు పెట్టినప్పుడు దాన్ని బ్లాక్ చేస్తున్నారు. ఆపై పన్నులు చెల్లించాలని, ఇంకో వారం రోజులు ఉంచితే మరిన్ని లాభాలొస్తాయని మభ్యపెడుతున్నారు. చివరకు ఆ మొత్తాలను కాజేస్తున్నారు.



**బాధితుల వివరాల్లోకెళ్తే..**

షేక్‌పేట్‌కు చెందిన ఓ ఐటీ ఉద్యోగి.. తన వాట్సాప్ నంబర్‌కు వచ్చిన మేసేజ్‌కి స్పందించాడు. వెంటనే మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ పేరు చెప్పుకొని గూగుల్ ప్లే స్టోర్ నుంచి సదరు ఉద్యోగి చేత మోసగాళ్లు ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. మొదట కొన్నాళ్లు లాభాలు చూపించడంతో పెట్టుబడులు పెడుతూపోయానని, చివరకు మోసపోయానని బాధితుడు వాపోయాడు. 2022 ఏప్రిల్ నుంచి ఈ నెల 4 వరకు రూ.90.70 లక్షలు పెట్టుబడిగా పెట్టినట్టు చెప్పాడు. అయితే మోసం తెలిసి బాధితుడు సీసీఎస్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. ఇక ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్‌లో గత నెల 4న మేసేజ్ వచ్చింది. అందులోని లింక్‌పై క్లిక్ చేయగానే 140 మంది ఉన్న వాట్సాప్ గ్రూప్‌లోకి వెళ్లింది. ఇక అక్కడి నుంచి సాగిన చాటింగ్‌లు.. బాధితుడిని రూ.35 లక్షల మేర ముంచాయి. మరో ఘటనలోనూ సైదాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.11 లక్షలు కాజేశారు. కాగా, ఈజీ మనీకి ఆశపడేవారే సైబర్ నేరగాళ్ల టార్గెట్ అవుతున్నారు. ఇకనైనా అనామక కాల్స్‌కు, మెసేజ్‌లకు స్పందించవద్దని, అనవసరపు లింక్‌లపై క్లిక్ చేయవద్దని సూచిస్తున్నారు. ఇలాంటివి వచ్చినప్పుడు తమను సంప్రదించాలని కోరుతున్నారు.

## డబ్ల్యూఈఎఫ్ లిస్ట్‌లో నెక్స్ట్‌వేవ్

న్యూఢిల్లీ, జూన్ 6: ఈ ఏడాదికిగాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) గురువారం ప్రకటించిన టెక్నాలజీ పయనీర్స్ జాబితాలో భారత్ నుంచి 10 స్టార్టప్‌లకు చోటు దక్కింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన నెక్స్ట్ వేవ్ కూడా ఉన్నది. మొత్తం 100 ప్రముఖ స్టార్టప్‌లతో ఈ లిస్టు విడుదలైంది. కాగా, భారతీయ స్టార్టప్‌లలో పిక్సెల్, నిరమై, సర్వం ఏఐ, ఆంపేర్అవర్, క్రోపిన్, హెల్త్‌ప్లిక్స్, ఎంట్రీ, ఇంటర్నేషనల్ బ్యాటరీ కంపెనీ, స్ట్రింగ్ బయో ఉన్నాయి.

## సీసీఎంబీ స్టార్టప్‌లకు నిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ): సీసీఎంబీలోని అటల్ ఇంక్యూబేషన్ సెంటర్‌లోని స్టార్టప్‌లు అనూహ్యంగా స్పెషల్ గ్రాంట్లను పొందుతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి మరో మూడు స్టార్టప్‌లు చేరాయి. పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా బయోడైమెన్షన్ (Biodimension), ఫిజిక్స్44 (Phyx 44), సెల్‌వర్స్(CellVerse) స్టార్టప్‌లకు రూ.45 లక్షలను గ్రాంట్ రూపం లో అందించనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది.

# రెండోరోజూ అదే జోరు

## సెన్సెక్స్ 693, నిఫ్టీ 289 పాయింట్ల లాభం



ముంబై, జూన్ 6: పడిలేచిన కెరటంలా దూసుకుపోతున్నాయి దేశీయ స్టాక్ మార్కెట్లు. వరుసగా రెండోరోజు గురువారం కూడా సూచీలు భారీగా లాభపడ్డాయి. ఎన్డీఏ కూటమి సులువుగా అధికారం చేపట్టే అవకాశాలుండటంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. ఫలితంగా 30 షేర్ల ఇండెక్స్ సూచీ తిరిగి 75 వేల మార్క్‌ను అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 692.27 పాయింట్లు ఎగబాకి 75,074.51 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో 915 పాయింట్ల వరకు లాభపడిన సూచీ చివర్లో ఈ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ 201.05 పాయింట్లు అందుకొని 22,821.40 వద్ద నిలిచింది. నిలకడైన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుండటంతో మార్కెట్లలో పాజిటివ్ దోరణి కనిపించిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- రంగాలవారీగా చూస్తే రియల్టీ 4.85 శాతం, ఇండస్ట్రీయల్స్ 3.69 శాతం, పవర్ 2.87 శాతం, ఐటీ 2.86 శాతం, యుటిలిటీ 2.52 శాతం, ఎనర్జీ 2.34 శాతం చొప్పున పెరిగాయి.
- టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎస్బీఐ, ఎన్టీపీసీ, ఇన్ఫోసిస్, లార్సెన్ అండ్ టుబ్రో, టీసీఎస్, విప్రో షేర్లు లాభపడ్డాయి.
- హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి.
- గత రెండు సెషన్లలో సెన్సెక్స్ 2,995.46 పాయింట్లు లేదా 4.15 శాతం, నిఫ్టీ 4 శాతం లాభపడింది.

## 21 లక్షల కోట్లు పెరిగిన సంపద

*స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతుండటంతో లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. వరుసగా రెండు రోజుల్లో రూ.21 లక్షల కోట్ల మేర పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.21,05,298.11 కోట్లు పెరిగి రూ.4,15,89,003.38 కోట్లకు (4.98 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నది.*


